సమయపాలన పాటించని అధికారులు

పెద్దేముల్ : ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మండల అధికారులు

అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

పెద్దేముల్, సెప్టెంబర్ 30 : సోమవారం ప్రజావాణి ఉదయం 10.30కి ప్రారంభం కాగా 11.38 వరకు వస్తూనే ఉన్నారు. మిగతా పశు వైద్య సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆయా శాఖల ఏఈలు, ఫారెస్టు అధికారులు, ఇతర అధికారులు హాజరుకాలేదు. ఇష్టారాజ్యంగా ప్రజావాణికి అధికారులు హాజరవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజలకు సేవచేయడానికి ఉన్నారా? లేక ఇంకా ఏమైనా చేయడానికి ఉన్నారా? అని వాపోతున్నారు. సోమవారం ప్రజావాణిలో మొత్తం 6 ఫిర్యాదులను స్వీకరించగా.. అందులో 1 రెవెన్యూకు, 5 మండల పరిషత్‌కు సంబంధించినవి ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకేంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో జర్నప్పను వివరణ కోరగా.. అధికారుల గైర్హాజరుపై వివరాలు పంపుతామని చెప్పారు.

ప్రజావాణికి రాని అధికారులకు మెమోలు

బషీరాబాద్ : ప్రజావాణికి రాని అధికారులకు మెమోలు జారీ చేయనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ, మండల పరిషత్, ఐకేపీ, అంగన్‌వాడీ శాఖలకు సంబంధించిన అధికారులు తప్ప మిగతా శాఖలకు సంబంధించిన అధికారులు రాకపోవడంపై తహసీల్దార్ వెంకటేశ్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీవోతో మాట్లాడుతూ ప్రజావాణికి రాని వివిధ శాఖల అధికారులకు మెమోలు జారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఐకేపీ సీసీ అంపయ్య ఉన్నారు.

బషీరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు

పెద్దేముల్ : తహసీల్దార్ ఎదుట నిందితుడిని బైండోవర్ చేయిస్తున్న తాండూరు ఎక్సైజ్ పోలీసు కానిస్టేబుల్ కృష్ణ

నాటుసారా పట్టుబడితే కఠిన చర్యలు

పెద్దేముల్, సెప్టెంబర్ 30 : నాటుసారా తయారుచేసినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు. సోమవారం తాండూరు ఎక్సైజ్ పోలీసులు ఓ వ్యక్తిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. మొదటిసారి నాటుసారాతో పట్టుబడితే బైండోవర్ చేయడం జరుగుతుందని, రెండోసారి పట్టుబడితే రూ.2 లక్షల వరకు జరిమానా విధించి 15 రోజుల్లో జరిమానా, డబ్బులు చెల్లించకపోతే ఒక సంవత్సరం జైలు శిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఇదిలాఉండగా మండల పరిధిలోని మదనంతాపూర్ గ్రామానికి చెందిన నేనావత్ పాండు ఇంట్లో 2 లీటర్ల నాటుసారా ఉందనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆయనను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించారు. కార్యక్రమంలో తాండూరు ఎక్సైజ్ కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ కథనం ప్రకారం.. కర్నాటక రాష్ట్రం మల్కేడ్‌కు చెందిన విశ్వనాథ్ వెంకట రమణయ్య(49), రవికుమార్, రవిచంద్రన్ సోమవారం కారులో హైదరాబాద్ నుంచి మల్కేడ్‌కు వెళ్తున్నారు. బొంరాస్‌పేట పెద్ద చెరువు వద్దకు రాగానే కారు టైరు పగిలిపోవడంతో ముందు వస్తున్న లారీని కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవరు సీటు పక్కన కూర్చున్న వెంకట రమణయ్యకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొడంగల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కారు డ్రైవర్ రవికుమార్, వెనకాల కూర్చున్న రవిచంద్రన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విశ్వనాథ్ బంధువు భాస్కర్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవూఫ్ తెలిపారు.

పౌర హక్కులపై అవగాహన కలిగిఉండాలి

మర్పల్లి, సెప్టెంబర్ 30 : ప్రతిఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగిఉండాలని ఏఎస్సై వెంకటయ్య, హాస్టల్ వార్డెన్ తుల్జారాంగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని కొంశట్‌పల్లి గ్రామంలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని, చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదని, 18 ఏండ్లు నిండని ఆడపిల్లలకు వివాహాలు చెయ్యకూడదని తెలిపారు. గ్రామంలో అసాంఘిక కార్యకలపాలు జరుగకుండా చూడాలని వారు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు

కులకచర్ల, సెప్టెంబర్ 30 : కులకచర్ల మండల పరిధిలోని రోకటిగుట్టతండాకు చెందిన మోతీలాల్ కూతురు పాత్లావత్ రవిచందన అనే గిరిజన విద్యార్థిని ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో వరంగల్‌లోని ఫాదర్ కొలంబో యూనివర్సిటీలో రవిచందన సీటు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని గ్రామస్తులతో పాటు మండల ప్రజలు అభినందించారు. రవిచందనను ఆదర్శంగా మిగతా విద్యార్థులు తీసుకోవాలన్నారు.

రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలి

సొసైటీ 47వ సర్వసభ్య సమావేశంలో పెద్దేముల్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్ : సమావేశంలో మాట్లాడుతున్న పెద్దేముల్ సొసైటీ చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబర్ 30 : రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని పెద్దేముల్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దేముల్‌లోని రైతువేదికలో పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం 47వ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 516 మంది రైతులకుగాను రూ.లక్షలోపు రుణమాఫీ 225 మందికి, రూ.1.50 వేల వరకు 45 మందికి, రూ.2 లక్షలలోపు 91 మందికి మొత్తం 364 మందికి రుణమాఫీ వర్తింపు జరిగిందన్నారు. ఇంకా సొసైటీ పరిధిలో సుమారు 152 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 12.12.2018 నుంచి 09.12.2023 మధ్యలో రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని, అర్హత ఉండి రుణమాఫీ వర్తించని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వివరాలను అందించాలని సూచించారు. రుణమాఫీ కానీ రైతుల రుణమాఫీ అక్టోబర్ చివరి వరకు అవుతుందన్నారు. ముఖ్యంగా సొసైటీ పరిధిలో రుణాలు తీసుకున్న రైతులు మొండిబకాయిదారులుగా మారకుండా తమ రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. సొసైటీ పరిధిలో రైతులకు పంట రుణాలే కాకుండా ఎల్‌టీ రుణాలు కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకు మేనేజర్ శ్రీనివాససాగర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

పంటల పరిశీలన

బషీరాబాద్, సెప్టెంబర్ 30 : మండల పరిధిలోని కాశింపూర్, నవాంద్గీ, క్యాద్గిరా, కొర్విచేడ్ తదితర గ్రామాల్లో శుక్రవారం ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి పరిశోధన స్థానం, రాజేంద్రనగర్ ప్రధాన శాస్త్రవేత్తలు డా.రాంగోపాల్‌వర్మ, డా.చంద్రమోహన్, డా.కిరణ్‌బాబు, ఏరువాక కేంద్రం, తాండూరు కో-ఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున తాండూరు ఏడీఏ రుద్రమూర్తితో కలిసి వరి, పత్తి, కంది పంటల క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా వారు వరిలో కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగును గమనించారు. కురుస్తున్న అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు, వివిధ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏవో సూర్యప్రకాశ్, ఏఈవోలు ఉన్నారు.

క్యాద్గిరా గ్రామంలో కంది పంటను పరిశీలిస్తున్న అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి

రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలి

పరిగి, సెప్టెంబర్ 30 : రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని పరిగి పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి సూచించారు. సోమవారం జరిగిన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రైతులకు సహకార సంఘం ద్వారా విరివిగా రుణాలు అందజేసినట్లు తెలిపారు. రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగడంతోపాటు సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. తద్వారా ఇతర రైతులకు రుణాలిచ్చేందుకు అవకాశం కల్పించాల్సిందిగా సూచించారు. రైతులకు బంగారు ఆభరణాలపై సైతం తక్కువ వడ్డీకే రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో అమరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, డైరెక్టర్లు ఉన్నారు.

త్వరలో పెట్రోల్ పంప్, రైస్ మిల్ ప్రారంభం

- రూ.10 కోట్ల బంగారం రుణాలు లక్ష్యం
- నవాంద్గి సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

బషీరాబాద్, సెప్టంబర్ 30 : నవాంద్గి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ పంప్, రైస్ మిల్ త్వరలోనే తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు నవాంద్గి సహకార సంఘం చైర్మన్ అల్లాపూర్ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు.

సోమవారం సహకార కార్యాలయంలో కార్యవర్గ సమావేశం, మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైస్ మిల్ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చిందని, పెట్రోల్ పంప్ నిర్మాణపు పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇప్పటి వరకు క్రాప్ లోన్‌లు రూ.కోటీ20లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఎల్‌టీ లోన్‌లు తీసుకున్న రైతులు చెల్లిస్తే సంఘం 50 శాతం వసూలుకు చేరుకుంటుందన్నారు. దీంతో కొత్త రైతులకు రుణాలిచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. బంగారం తాకట్టు పెట్టుకుని రూ.10కోట్లు ఇచ్చేందుకు సంఘం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సభ్యులున్నారు.

అసెంబుల్డ్ బోర్ డ్రిల్లింగ్ వాహనం పట్టివేత

పరిగి, సెప్టెంబర్ 30 : బోర్ డ్రిల్లింగ్ వాహనాన్ని తయారుచేసి ఎలాంటి పన్నులు చెల్లించకుండా విదేశాలకు తరలిస్తుండగా పరిగి పోలీసులు పట్టుకున్నారు. పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారంజజ పరిగి పట్టణంలోని కొడంగల్ చౌరస్తా సమీపంలో ఆదివారం అర్ధరాత్రి పోలీసులకు అందిన సమాచారం మేరకు నెంబర్ ప్లేట్ లేని బోర్‌వెల్ బండిని ఆపి పత్రాలు చూపించమనగా.. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టగా హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో బోర్ డ్రిల్లింగ్ వాహనాన్ని అసెంబుల్డ్‌గా ఫిట్ చేసి ఎలాంటి పత్రాలు లేకుండానే పరిగి, కర్నాటక మీదుగా మహారాష్ట్రలోని ముంబై పోర్టు ద్వారా జాంబియా దేశానికి తరలిస్తున్నట్లు తేలింది. ఈ వాహనాన్ని పరిగి పోలీసులు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. పోలీసులకు పట్టుబడింది ఒక వాహనమే కాగా.. ఇంతకుముందు నుంచే ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తున్నది. దీని వెనకాల ఎవరున్నారనేది తేలాల్సి ఉన్నది.

పోలీసులు పట్టుకున్న బోర్ డ్రిల్లింగ్ వాహనం

కులకచర్ల మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి - కులకచర్ల, సెప్టెంబర్ 30

పూడూరులో బదిలీపై వెళ్లిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు 16 మందిని సన్మానించిన విద్యార్థులు, నాయకులు - పూడూరు, సెప్టెంబర్ 30

రక్తదాన శిబిరంలో పాల్గొన్న పబ్లిక్ వాయిస్ ఫోరం సభ్యులు వేణుగోపాల్ మొదటి వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం పబ్లిక్ వాయిస్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాలం ప్రథమ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న ఫోరం సభ్యులు - వికారాబాద్, సెప్టెంబర్ 30

బొంరాస్‌పేట మండలంలోని కొత్తూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించగా.. ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై అబ్దుల్ రవూఫ్ - బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30

మారేపల్లితండా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నవీన్‌కుమార్ ఇటీవల పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా విజయం సాధించగా.. మారేపల్లితండా మాజీ సర్పంచ్ పాండూనాయక్ గ్రామస్తులతో కలిసి సన్మానించారు. - పెద్దేముల్, సెప్టెంబర్ 30

వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పదవీ విరమణ పొందిన టౌన్ ప్లానింగ్ అధికారిని శరభలింగంను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్, మున్సిపల్ కమిషనర్, అధికారులు - వికారాబాద్, సెప్టెంబర్ 30

బొంరాస్‌పేట్ : పోషకాహారం గురించి వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బషీరాబాద్ : పౌష్టికాహారం గురించి తెలియజేస్తున్న టీచర్లు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు వివిధ పోషకాహార వంటలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణిమాల, ఏఎన్ఎం శ్రీలత పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

బషీరాబాద్ : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. బషీరాబాద్ క్లస్టర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

విద్యార్థులకు న్యాస్ పరీక్ష

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయడానికి జాతీయ సాధన సర్వే(న్యాస్) ఆధ్వర్యంలో మాక్ టెస్ట్-2ను సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించారు. నాందార్‌పూర్‌లో పరీక్షను ఎంఈవో హరిలాల్ పరిశీలించారు. పరీక్ష నివేదికలను ఆయా పాఠశాలల హెచ్ఎంలు సాయంత్రం ఎంఈవోకు అందజేశారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచేలా విద్యాబోధన ఉండాలి

పెద్దేముల్, సెప్టెంబర్ 30 : ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేలా తరగతి గదిలో విద్యాబోధనను చేయాలని పెద్దేముల్ ఎంఈవో నర్సింగ్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొట్లపల్లి, గాజీపూర్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు నిర్వహించిన జాతీయ సాధన సర్వే(ఎన్ఏఎస్) మాక్ టెస్ట్-02 పరీక్షల నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యాబోధనను చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో తనిఖీలు చేపడతామన్నారు. నవంబర్‌లో నిర్వహించే జాతీయ సాధన సర్వే (ఎన్ఏఎస్) పరీక్షకు అన్ని పాఠశాలల విద్యార్థులను తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపరంగా అన్ని విధాలుగా సన్నద్ధం చేయాలని ఆదేశించారు.

బొంరాస్‌పేట్ : న్యాస్ పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో హరిలాల్

పెద్దేముల్ : గొట్లపల్లిలో విద్యార్థులకు ఎన్ఏఎస్‌మాక్ టెస్ట్-02 పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈవో నర్సింగ్ రావు

విద్యార్థులు బాగా చదువుకోవాలి

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు బాగా చదువుకుని పైకి రావాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సంస్థ ద్వారా బ్యాగులు, మ్యాట్లు, పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో హరిలాల్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, హెచ్ఎం రవీందర్‌గౌడ్, హెచ్ఎం పరమేశ్వరి, ఉపాధ్యాయులున్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న చైర్మన్ రాజేశ్‌రెడ్డి తదితరులు

ఆత్మ రక్షణకు తైక్వాండో

తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టుల ప్రదానం

వికారాబాద్, సెప్టెంబర్ 30 : వికారాబాద్ పట్టణంలోని అగస్త్య విద్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ తరపున శ్రీనివాస్ ఆధ్వర్యంలో బెల్ట్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో సెక్రటరీ గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి తైక్వాండో కరాటే నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల నైపుణ్యం ఆధారంగా బెల్ట్‌లను ప్రధానం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అగస్త్య విద్యాలయం డైరెక్టర్ బుచ్చిరెడ్డి, కరస్పాండెంట్ సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కులకచర్ల, సెప్టెంబర్ 30 : మోడల్ స్కూల్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సోమవారం కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఇంటి పరిసరాలు, వీధులు, పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల ఆవరణల్లో పరిశుభ్రత పాటించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు.కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సంతోశ్, కారోబార్ యాదయ్య, గ్రామస్తుడు వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలి

కార్మికులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న పరిగి పురపాలక చైర్మన్ ముకుంద అశోక్

పరిగి, సెప్టెంబర్ 30 : కార్మికులు హెల్త్ క్యాంపు ద్వారా ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని పరిగి పురపాలక చైర్మన్ ముకుంద అశోక్ అన్నారు. సోమవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిగి పురపాలక కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పారిశుధ్యపు పనులు సక్రమంగా చేస్తారనే ఉద్దేశంతోనే హెల్త్ క్యాంపును నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, పురపాలక మేనేజర్ నరేశ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో పదవీ విరమణ పొందిన వాచ్‌మెన్ అనంతయ్య, బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ - తాండూరు రూరల్, సెప్టెంబర్ 30

పూడూరు సొసైటీలో రైతు రుణాల మంజూరుకై సంతకం చేస్తున్న సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి

పూడూరు పీఏసీఎస్ ఆదాయం రూ.91లక్షలు

పూడూరు, సెప్టెంబర్ 30 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రూ.91లక్షల ఆదాయంతో కొనసాగుతున్నదని పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండల సొసైటీ సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన సీఈవో ఖలీల్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. సంఘంలోని 706 మంది రైతులకు రూ.4కోట్ల30లక్షలు రుణమాఫీ అయినట్లు తెలిపారు. ప్రస్తుతం 470 మంది రైతులకు రూ.4కోట్ల10లక్షలు కొత్త రుణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. గత నాలుగున్న సంవత్సరాల నుంచి బంగారంపై రైతులకు రూ.3కోట్ల50లక్షలు అప్పులివ్వగా, ప్రస్తుతం రూ.10కోట్లు ఇస్తున్నట్లు వివరించారు. దీర్ఘకాలిక(ఎల్‌టీ) లోన్లు రూ.6కోట్ల85లక్షలను రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. సొసైటీలో 107 మంది సుమారు రూ.కోటీ10లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. రైతుల పంటలకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచి రూ.53లక్షల వ్యాపారం చేసినట్లు తెలిపారు. అంగడి చిట్టంపల్లి, మన్నెగూడ గ్రామాల్లో నిర్మించిన గోదాంలను ప్రైవేట్ వ్యాపారస్తులకు లీజ్‌కు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పెద్దఉమ్మెంతాల్‌లో నిర్మాణంలో ఉన్న గోదాములను త్వరగా పూర్తి చేయిస్తామని తెలిపారు. సొసైటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది ఉన్నారు.

భగీరథ నీటిని వృథా చేయరాదు

బంట్వారం, సెప్టెంబర్ 30 : మిషన్ భగీరథ నీటిని ఎట్టి పరిస్థితిల్లోనూ వృథా చేయరాదని ఎంపీడీవో రాములు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ వాటర్ మెన్, పంచాయతీ కార్యదర్శులకు నీటి సరఫరాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆయన ప్రారంభించి మాట్లాడారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులున్నా వాటిని సరిచేసుకుని సరఫరాను కొనసాగించాలన్నారు. ప్రధానంగా కొన్ని చోట్ల చిన్నచిన్న సమస్యలతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటాయన్నారు. విద్యుత్ సరఫరా, పైప్ లైన్‌ల లీకేజీ లాంటి చిన్న సమస్యలను స్థానికంగా ఉండే లైన్‌మన్‌లే పరిష్కరించుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ వేణుమాధవ్, మాస్టర్ ట్రైనర్ ఫయాజ్ పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాములు